# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలు కొద్దిసేపటి క్రితం ముగిశాయి.
- వైసీపీ అధికారంలోకి వస్తే ప్రస్తుత పథకాలు యథాతథంగా కొనసాగుతాయని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.
- విశాఖ జిల్లాలో ఈ సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలులో వుంటుందని జిల్లా కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎ మల్లికార్జున తెలిపారు.
- ఏన్డీయే కూటమి అధికారంలోకి రాగానే యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.

========================

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలు కొద్దిసేపటి క్రితం ముగిశాయి. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ, సాయంత్రం 6 గంటలతో ప్రచార కార్యక్రమాలు ముగిసాయని, పోలింగ్‌కు 48 గంటల ముందునుంచి ఉండే సైలెన్స్ పీరియడ్ లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. ఈ సాయంత్రం నుంచి లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సాయంత్రం 6 తర్వాత స్థానికేతరులు నియోజకవర్గాల్లో ఉండకూడదని, రాజకీయ ప్రభావం ఉండే సంక్షిప్త సందేశాలపైనా నిషేధం తప్పనిసరి అని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

=========================

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఏలూరు జిల్లా కైకలూరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వస్తే ఇంటింటా అభివృద్ధితో పాటు, ప్రస్తుత పథకాలు యధాతథంగా కొనసాగుతాయని అన్నారు. మేనిఫెస్టోలో ఉన్న 99 శాతం హామీలు నెరవేర్చామని అన్నారు. విద్యను ప్రోత్సహిస్తూ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చామని, అదేవిధంగా మహిళల కోసం అనేక పథకాలు అమలు చేశామని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

=========================

జిల్లా వ్యాప్తంగా ఈ సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలులో వుంటుందని విశాఖ జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈరోజు కలెక్టరేట్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 144 సెక్షన్ నేపథ్యంలో అయిదుగురికి మించి ఎక్కడా గుమిగూడ రాదని స్పష్టం చేశారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో 9627 ఈవీఎం లు వినియోగిస్తున్నామని, జిల్లాలో 20 లక్షల 12 వేల మంది ఓటర్లకు. 1859 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. విశాఖ పోలీస్ కమిషనర్ రవి శంకర్ మాట్లాడుతూ, ఈ సాయంత్రం 6 నుంచి డ్రై డే అమలులో వుంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసి కెమేరాలు ఏర్పాటు చేసి ప్రతి కదలిక రికార్డ్ అయ్యే విధంగా టెక్నాలజీ వినియోగిస్తున్నామని తెలియజేశారు.

=========================

ఉద్యోగ అవకాశాలు పెరగాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలని తెలుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాలలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ‘‘అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీ, రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైనే చేస్తామని అన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, పింఛన్‌ను 4 వేల రూపాయలకు పెంచి అందిస్తామని అన్నారు.

=========================

తూర్పు గోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గ రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం, రాజుపాలెం గండ్రేడులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ, గత 10 సంవత్సరాలు కాలంలోని నరేంద్ర మోదీ పాలనలో భారతీయ జనతా పార్టీ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. ఎన్డీయే కూటమితోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

=========================

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదాను కల్పిస్తామని ఆ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా కడపలో నిర్వహించిన ప్రచార బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి పది సంవత్సరాల పాటు ప్రత్యేక హోదాతో పాటు, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, అదేవిధంగా కడప స్టీల్ ప్లాంట్‌ను పునరుద్దరిస్తామని అన్నారు. కడపలోని ఇడుపులపాయ వద్ద దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద రాహుల్ గాంధీ, షర్మిల నివాళి అర్పించారు.

విరామం

=========================

రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో ఈ నెల 14 వరకు తేలిక పాటి నుండి మోస్తారు వర్షాలతో పాటు, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయని పేర్కొంది. రాబోయే 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని వెల్లడించింది. ఉత్తరాంధ్ర, కోస్తా తీర ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుసే అవకాశము ఉందని వాతావరణ శాఖ అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

=========================

ఈనెల 16న ఎన్నికల షెడ్యూలు విడుదల అయినప్పటి నుంచి ఇప్పటివరకు కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పని చేస్తోందని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ పేర్కొన్నారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని, ఈనెల 12, 13వ తేదీల్లో కమాండ్ కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వర్తిస్తున్న నోడల్ అధికారులందరూ అత్యుత్తమ పని తీరు కనపరచాలని ఆయన అన్నారు.

=========================

భీమవరంలో 14 కోర్టు భవనాల సముదాయం నిర్మాణానికి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, పశ్చిమగోదావరి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఈరోజు భూమి పూజ నిర్వహించారు. భీమవరంలోని పాత సివిల్ కోర్టు ప్రాంగణంలో 80.60 కోట్ల రూపాయల వ్యయంతో ఈ నూతన కోర్టు భవనాలను నిర్మించానున్నారు.

=========================

జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. ఎన్నికల ఏర్పాట్లపై ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఈరోజు సాయంత్రం 5 గంటల నుండి 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు, అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

=========================

ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జిల్లాలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ప్రకాశం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లపై ఆయన ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ, జిల్లాలో కేంద్ర బలగాలతో నాలుగు అంచల భద్రత ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. శిక్షణలో ఉన్న 8 మంది ఐపీఎస్ అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి జిల్లాకు వచ్చారని, వారిని జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కేటాయించినట్లు ఆయన తెలియజేశారు.

=========================

ఎన్నికల సంఘం నియమ నిబంధల మేరకు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని నరసాపురం పార్లమెంటు వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా కోరారు. ఈరోజు భీమవరంలో నరసాపురం పార్లమెంటు నియోజవర్గనికి పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రచారాలకు సంబంధించి వ్యయాల రిజిస్టర్లను పరిశీలించి, ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రచారంలో చేసే ఖర్చులను షాడో బృందాలు, చెల్లింపులను మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనటరింగ్ కమిటీ (ఎం.సీ.ఎం.సీ) ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చును మాత్రమే చేయాలని, నిబంధనలను అతిక్రమించి ఎక్కువ ఖర్చును చేసినట్లయితే అనర్హత వేటు పడుతుందని, ఈ విషయాన్ని పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి గమనించాలని పియూష్ శుక్లా తెలిపారు.

==========================

==========================